
సాక్షి
అనంతపురం
సోమవారం । 10 । మార్చి । 2025



టమాట కిలో రూ.8

అనంతపురం కక్కలపల్లి మండీలో ఆదివారం కిలో టమాట గరిష్ట ధర రూ.8 పలికింది. కనిష్టం 5, సరాసరి రూ.7 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.



వారెవ్వా.. ఫిదా హోగయా

రంజాన్ మాసంలో మాత్రమే దొరికే అరబ్బుల ప్రత్యేక వంటకం హలీమ్ నోరూరిస్తోంది. వారెవ్వా.. ఫిదా హోగయా అంటూ కితాబందుకుంటోంది. 8లో



న్యూస్‌రీల్

నేడు కలెక్టరేట్‌లో ఫిర్యాదుల స్వీకరణ


కలెక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం అర్బన్: 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' ఫిర్యాదుల స్వీకరణ కార్యక్రమాన్ని సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ వి.వినోద్‌కుమార్ తెలిపారు. రెవెన్యూ భవన్‌లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ కార్యక్రమం సాగుతుందన్నారు. కార్యక్రమంలో అన్ని శాఖల అధికారులు పాల్గొంటారని, ప్రజలు తమ సమస్యలను క్లుప్తంగా అర్జీ రూపంలో తెలియజేయాలని సూచించారు.

పట్టుకుంది 144.. కేసులో చూపింది 52!

పుట్లూరు: తనిఖీల్లో 144 మద్యం బాటిళ్లు పట్టుపడితే.. కేసులో కేవలం 52 మాత్రమే చూపి పోలీసులు తమ నైజాన్ని బయటపెట్టుకున్నారు. వివరాలు.. పుట్లూరు మండలం చెర్లోపల్లి – నారాయణరెడ్డిపల్లి గ్రామాల మధ్య శనివారం రాత్రి అక్రమంగా తరలిస్తున్న మద్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఆటోలో మూడు కేసుల్లో మొత్తం 144 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు విశ్వసనీయ సమాచారం. అయితే టి.నరసింహులు అనే వ్యక్తి 52 మద్యం బాటిళ్లు తరలిస్తూ పట్టుబడినట్లు కేసు నమోదు చేసి, చేతులు దులుపుకున్నారు. ఈ విషయం బహిర్గతం కావడంతో మిగిలిన 92 మద్యం బాటిళ్లు ఎవరి కోసం దాచారో చెప్పాలని పలువురు ప్రశ్నిస్తున్నారు. అక్రమంగా కేసుల నమోదుకు ఈ బాటిళ్లను అడ్డు పెట్టనున్నారా? లేదా పోలీసులే గుట్టుగా మద్యం వ్యాపారం సాగిస్తున్నారా? అనే అనుమానాలు వ్యక్తం చేశారు.

రాయదుర్గంలో జోరుగా పావురాల పందేలు


జాతీయ రహదారిపై గుమికూడిన పందెంరాయుళ్లు

రాయదుర్గంటౌన్: నియోజకవర్గ కేంద్రం రాయదుర్గంలో పావురాల పందేలు జోరుగా సాగుతున్నాయి. పావురాలను గాల్లోకి ఎగరవేసి వాటిలో ఏది ముందుగా గమ్యాన్ని చేరితే దానిని విజేతగా ప్రకటిస్తారు. ఈ క్రమంలో రూ. లక్షల్లో బెట్టింగ్ సాగుతోంది. ఆదివారం పావురాలను ఎగుర వేసి వాటి రాక కోసం పట్టణ శివారులోని పైతోట వద్ద జాతీయ రహదారిపై పెద్ద సంఖ్యలో పందెం రాయుళ్లు గుమికూడారు. దీంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది.

తెలుగు తమ్ముళ్ల కొట్లాట



గుత్తి: బోరు బిల్లుల విషయంలో టీడీపీలో రెండు వర్గాల మధ్య కొట్లాట జరిగింది. వివరాలు.. ఎన్నికలకు ముందు, తర్వాత బోరు వేసిన బిల్లులు ఇప్పటి వరకూ చెల్లించలేదని, వీటిని వెంటనే మంజూరు చేయించాలంటూ టీడీపీ కార్యాలయంలో శనివారం రాత్రి ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం తనయుడు ఈశ్వర్ ఎదుట బోరు రిగ్గు నిర్వాహకుడు నాగరాజు వాపోయాడు. దీంతో అక్కడే ఉన్న టీడీపీ నేత చౌదరి జోక్యం చేసుకుని వాగ్వాదానికి దిగాడు. అక్కడే ఉన్న పలువురు నేతలు జోక్యం చేసుకుని సర్దిచెప్పడంతో అప్పటికి వివాదం సద్దుమణిగింది. అనంతరం ఇదే అంశాన్ని తనకు అత్యంత సన్నిహితుడైన గుత్తి ఆర్‌ఎస్‌కు చెందిన రాజాకు చౌదరి తెలిపాడు. దీంతో రాజా ఆగ్రహం వ్యక్తం చేస్తూ వెంటనే నాగరాజుకు ఫోన్ చేసి దుర్భాషలాడాడు. ఎంత ధైర్యముంటే చౌదరితో వాదనకు దిగుతావ్ అంటూ గద్దించాడు. అదే స్థాయిలో బోర్ రిగ్గు నిర్వాహకుడు కూడా సమాధానమివ్వడంతో ఇద్దరి మధ్య ఫోన్‌లోనే మాటల యుద్ధం సాగింది. దమ్ముంటే గాంధీ సర్కిల్‌కు రావాలంటూ ఇద్దరూ సవాల్ విసురుకున్నారు. అక్కడితో ఆగకుండా గాంధీ సర్కిల్ వద్ద రాత్రి 11 గంటల సమయంలో పెద్దసంఖ్యలో తమ అనుచరవర్గాలను దింపారు. విషయం తెలుసుకున్న పోలీసులు సకాలంలో అక్కడకు చేరుకుని ఇరువర్గాల వారిని చెదరగొట్టారు.


అశేష భక్త జనం మధ్య సాగుతున్న గవిమఠం చంద్రమౌళీశ్వరస్వామి మహా రథం

జయ జయ మహాదేవ..

- నేత్రపర్వం... చంద్రమౌళీశ్వరుడి బ్రహ్మ రథోత్సవం
- శివనామస్మరణతో మార్మోగిన గవిమఠం

ఉరవకొండ: 'జయ జయ మహాదేవ.. శంభో సదా శివ' అంటూ భక్తులు చేసిన ప్రణవ నాదం ప్రతిధ్వనించింది. భక్తులతో గవిమఠం కిటకిటలాడింది. చంద్రమౌళీశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం బ్రహ్మరథోత్సవం నేత్రపర్వంగా సాగింది. ఉదయం స్వామి వారి మూలవిరాట్‌కు విశేష పూజలు, అభిషేకాలు, మహా రుద్రాభిషేకాలు నిర్వహించారు. గవిమఠం 8వ పీఠాధిపతులు జగద్గురు చెన్నబసవ రాజేంద్ర స్వామి, ఉత్తరాధికారి డాక్టర్ కరిబసవ రాజేంద్రస్వామి, మఠం సహాయ కమిషనర్ కె.రాణి ఆధ్వర్యంలో చంద్రమౌళీశ్వరుడి


చంద్రమౌళీశ్వరస్వామి మూలవిరాట్‌ను ఊరేగింపుగా తీసుకొస్తున్న దృశ్యం

ఉత్సవ మూర్తిని విశేషంగా అలంకరించి మహారథం వద్దకు తీసుకొచ్చారు. అనంతరం శాస్త్రోక్తంగా రథం చుట్టూ ప్రదక్షిణలు, పూజలు చేసి రథంపై కొలువుదీర్చి ఉత్సవం ప్రారంభించారు. గవిమఠం ఆస్థాన గజలక్ష్మి (ఏనుగు) రథాన్ని అనుసరిస్తూ ముందుకు కదలగా.... హరహర మహాదేవ శంభో శంకర అంటూ భక్తులు రథాన్ని లాగుతూ భక్తి పారవశ్యంలో మునిగి తేలారు. రథంపై పండ్లు విసిరి మొక్కులు తీర్చుకున్నారు. రథోత్సవాన్ని తిలకించడానికి ఆంధ్రా, తెలంగాణ నుంచే కాకుండా కర్ణాటక రాష్ట్రం నుంచి కూడా భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరావడంతో ఆ ప్రాంతమంతా కిక్కిరిసిపోయింది.

ఖాద్రీశుడి కల్యాణము

చూతము రారండి

- శ్రీవారి బ్రహ్మోత్సవాలు ప్రారంభం
- నేడు స్వామివారి కల్యాణోత్సవం

కదిరి: ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. బ్రహ్మోత్సవాల్లో అత్యంత ప్రాధాన్యత సంతరించుకున్న శ్రీవారి కల్యాణోత్సవం సోమవారం రాత్రి 9 గంటలకు జరగనుంది. రాష్ట్ర ప్రభుత్వం తరఫున మంత్రి లోకేష్ స్వామివారికి పట్టువస్త్రాలు తీసుకొస్తారని స్థానిక ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్ మీడియాకు తెలిపారు. శ్రీవారి కల్యాణోత్సవాన్ని భక్తులందరూ కనులారా వీక్షించేందుకు ఆలయ, పోలీసు అధికారులు తగు చర్యలు తీసుకుంటున్నారు. వేదికపై అర్చకులు మాత్రమే కూర్చునే విధంగా అధికారులు నిర్ణయించారు. కల్యాణోత్సవం జరిపేందుకు తిరుమల తిరుపతి దేవస్థానం నుంచి కొందరు అర్చక పండితులు హాజరుకానున్నారు. ఉమ్మడి అనంతపురం జిల్లా నలుమూలల నుంచే కాకుండా కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల నుంచి కూడా భక్తులు శ్రీవారి కల్యాణోత్సవానికి పెద్ద సంఖ్యలో హాజరవుతారని అధికారులు అంచనా వేస్తున్నారు.

- స్వామివారిని జిల్లా కలెక్టర్ వినోద్‌కుమార్ సతీసమేతంగా ఆదివారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు కలెక్టర్‌ను సత్కరించి, స్వామివారి చిత్రపటాన్ని బహూకరించారు.

ఘనంగా అంకురార్పణ..

ముందుగా అర్చకులు శాస్త్రోక్తంగా అంకురార్పణ గావించి బ్రహ్మోత్సవాలను ప్రారంభించారు. మంగళ వాయిద్యాల మధ్య నారసింహుడు రాత్రి 9.30 గంటల ప్రాంతంలో ఆలయానికి నైరుతి దిశలో ఉన్న మండపానికి చేరుకున్నారు. అర్చక పండితులు నిర్ణీత పునీత ప్రదేశంలో 'భూమి పూజ'తో పుట్ట మన్ను సేకరించి, ఆలయం చుట్టూ ప్రదక్షిణ చేశారు. యాగశాలలో ఆ మట్టితో నింపిన 9 పాలిక(కుండ)లలో నవ ధాన్యాలతో అంకురార్పణ (బీజావాపం) చేశారు. ఈ నవధాన్యాలు దినదినాభివృద్ధి చెందేలా అర్చకులు బ్రహ్మోత్సవాలు


యాగశాలలో కొలువుదీరిన ఖాద్రీశుడు

పూర్తయ్యే వరకూ రోజూ నీరు పోసి పచ్చగా మొలకెత్తేలా చూస్తారు. ఏ ధాన్యం బాగా మొలకెత్తుతుందో ఆ పంట ఈ యేడాది బాగా పండుతుందని ఈ ప్రాంత ప్రజల నమ్మకం. బ్రహ్మోత్సవాల్లో నారసింహుడు ఈ పక్షం రోజుల పాటు యాగశాలలోనే గడిపి, ఇక్కడి నుంచే తన భక్తులకు దర్శన భాగ్యం కల్గిస్తారు.


కలెక్టర్ వినోద్‌కుమార్ దంపతులకు శ్రీవారి చిత్రపటం అందిస్తున్న ఆలయ అర్చకులు

జయహో భారత్...


అనంతపురం టవర్‌క్లాక్ వద్ద ఆనందోత్సాహంలో అభిమానులు (ఇన్‌సెట్) టపాసుల వెలుగులు

చాంపియన్స్ ట్రోఫీలో ఇండియా జట్టు జయకేతనం ఎగరేసింది. న్యూజిలాండ్‌ను చిత్తు చేసి రోహిత్ సేన ట్రోఫీని కైవసం చేసుకుంది. దీంతో అభిమానుల సంబరాలు మిన్నంటాయి. ఉమ్మడి జిల్లాలోని ప్రధాన పట్టణాల్లో ఆదివారం రాత్రి టపాసులు కాలుస్తూ సంతోషం వ్యక్తం చేశారు. జయహో భారత్ అంటూ నినదించారు. భవిష్యత్తులో భారత జట్టు మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం


జాతీయ జెండా చేతబూని..

అంగన్‌వాడీలపై ఉక్కుపాదం!

తాడిపత్రి రూరల్: అంగన్‌వాడీలపై చంద్రబాబు ప్రభుత్వం ఉక్కుపాదం మోపుతోంది. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా మోసపూరితంగా వ్యవహరిస్తున్న వైనంపై నిరసన తెలిపేందుకు అంగన్‌వాడీలు సోమవారం విజయవాడలో మహా ధర్నాకు పిలుపునిచ్చారు. ఈ క్రమంలో జిల్లా నుంచి మహా ధర్నా కార్యక్రమంలో పాల్గొనేందుకు వెళ్తున్న అంగన్‌వాడీలను ఎక్కడికక్కడ పోలీసులతో చంద్రబాబు ప్రభుత్వం అడ్డుకుంది. పైగా వారిని భయపెట్టేందుకు సెక్టార్ మీటింగ్ అంటూ డ్రామాకు తెరలేపింది. మహా ధర్నాకు బయలుదేరిన తీవ్ర పరిణామాలు ఉంటాయని ఐసీడీఎస్ అధికారులు హెచ్చరికలకు దిగారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు పోలీసులు అంగన్‌వాడీల కదలికలపై నిఘా ఉంచారు. ముందస్తు నోటీసులు అందించారు. అయినా విజయవాడ మహాధర్నాకు వెళ్తున్న అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లను బస్టాండ్‌లు, రైల్వే స్టేషన్ల వద్ద పోలీసులు అడ్డుకున్నారు. యూనియన్ నాయకుల ముందస్తు అరెస్టులు, గృహ నిర్బంధాలకూ వెనుకాడలేదు. అంగన్‌వాడీ సెంటర్లను మూసివేసి ధర్నాకు వెళ్లే వారి వివరాలను సేకరించాలని గ్రామ సచివాలయ మహిళా పోలీసులకు ఆదేశాలు జారీ చేసినట్లు తెలిసింది. అయితే, ఎన్ని అడ్డంకులు సృష్టించినా మహా ధర్నాకు వెళ్లి తీరుతామని అంగన్‌వాడీలు తెలిపారు.

అంగన్‌వాడీల డిమాండ్లు ఇలా...

- అంగన్‌వాడీలకు నెలకు రూ.28 వేల వేతనంతో పాటు గ్రాట్యుటీ అమలు చేయాలి.
- హెల్పర్ల పదోన్నతులపై విధివిధానాలను అమలు చేయాలి.
- ఇంటి అద్దెలు, టీఏ బిల్లులు మంజూరు చేయాలి.
- సర్వీస్‌లో మృతి చెందిన వారికి మట్టి ఖర్చుల కింద రూ. 20 వేలు ఇవ్వాలి.
- ప్రీ స్కూల్‌ను బలోపేతం చేసి 'తల్లికి వందనం' అమలు చేయాలి.
- ఎన్నికల సమయంలో చంద్రబాబు ఇవే హామీలు ఇచ్చారని, వీటిని వెంటనే అమలు చేయాలని అంగన్‌వాడీలు డిమాండ్ చేస్తున్నారు.


విజయవాడ మహాధర్నాకు వెళ్తున్న జిల్లాకు చెందిన అంగన్‌వాడీ కార్యకర్తలను ఆదివారం రాత్రి వైఎస్సార్ జిల్లా యర్రగుంట్ల రైల్వేస్టేషన్‌లో బలవంతంగా కిందకు దించుతున్న పోలీసులు

సెలవు ఇవ్వం



ప్రభుత్వ ఆదేశాల మేరకు సోమవారం ఎవరికీ సెలవు ఇవ్వడం లేదు. సెక్టార్ మీటింగ్ పెట్టుకోవాలని ఆదేశాలు ఉన్నాయి. ప్రభుత్వం అమలు చేయనున్న పథకాల గురించి వివరించడానికి సూపర్‌వైజర్లు మీటింగ్ పెట్టుకుంటున్నారు. అంగన్‌వాడీలపై ఎలాంటి ఒత్తిళ్లు, బెదిరింపులు చేయడం లేదు.

– సాజిదాబేగం, సీడీపీఓ, తాడిపత్రి

భయపడేది లేదు..



కూటమి ప్రభుత్వం చేస్తున్న బెదిరింపులకు అంగన్‌వాడీలు భయపడరు. ప్రభుత్వ మెడలు వంచైనా హామీలను నెరవేర్చుకుంటాం. గతంలో టీడీపీ ప్రభుత్వం ఉన్నప్పుడు అంగన్ వాడీలను గుర్రాలతో తొక్కించినా భయపడలేదు. ప్రస్తుతం మహాధర్నాను అడ్డుకోవడానికి శత విధాలా ప్రయత్నిస్తున్నారు.

– శకుంతల, ఉమ్మడి జిల్లా అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ అధ్యక్షురాలు

తిప్పకుని.. తప్పకుంటున్నారు!

- 'నీటి కుళాయి కోసం అధికారుల చుట్టూ తిరిగినా పట్టించుకోలేదు. కుళాయి కనెక్షన్ ఇప్పించేలా చూడండి' అంటూ తాడిపత్రి మండలం చిన్నపొలమడ గ్రామానికి చెందిన సూర్యప్రకాష్ జనవరి 27న ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశాడు.
- తాము నివాసముంటున్న 9వ వార్డులో మురికి కాలువ నిర్మాణం కోసం గ్రామసభలో తీర్మానం చేసినా పనులు చేపట్టలేదని, తగిన చర్యలు తీసుకోవాలని గార్లదిన్నె మండలం కల్లూరుకు చెందిన మహమ్మద్ రఫీ ఈనెల 3వ తేదీన 'పరిష్కార వేదిక'లో కలెక్టర్‌కు విన్నవించుకున్నాడు.
- 'ఇంటి స్థలం సర్వే నంబరు 506–4లో ప్లాట్ నంబరు 86 హద్దులు పోయాయి. అధికారులకు చెప్పి హద్దులు చూపించండి' అంటూ కూడేరు మండలం సంగమేశ్వర కాలనీకి చెందిన బషీర్ అహమ్మద్ ఈనెల 3న పరిష్కార వేదికలో అధికారులను కోరాడు.

.... ఇవన్నీ గ్రామ, మండల స్థాయిలో పరిష్కారం కావాల్సిన సమస్యలే. కానీ, అక్కడి అధికారులు పట్టించుకోకపోవడంతో చేసేది లేక ప్రజలు జిల్లా స్థాయి అధికారుల దృష్టికి తీసుకొస్తున్నారు. ఒకటి రెండు కాదు ప్రతి వారం పదుల సంఖ్యలో ఇలాంటి సమస్యలు ఉంటున్నాయి.

- మండల స్థాయిలో పరిష్కారం కాని ప్రజాసమస్యలు
- వ్యయ ప్రయాసలకోర్చి కలెక్టరేట్‌కు వస్తున్న బాధితులు
- కిందిస్థాయి అధికారుల తీరుపై సర్వత్రా విమర్శలు

సమస్యలపై జూన్ నుంచి అందిన అర్జీలు	
మొత్తం అర్జీలు	28,706
రెవెన్యూకు సంబంధించి	11,556
సర్వేపై	8,600
పోలీసు	2,300
ఇతర శాఖలు	6,250

అనంతపురం అర్బన్: గ్రామస్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు అధికారులు బాధ్యతగా విధులు నిర్వర్తించి ప్రజా సమస్యలకు సంతృప్తికర పరిష్కారం చూపించాల్సి ఉన్నా ఇలాంటి పరిస్థితి జిల్లాలో ఎక్కడా కానరావడం లేదు. ప్రజలకు జవాబుదారీగా ఉంటూ వారి సమస్యలను చిత్తశుద్ధితో పరిష్కరించాలనే ఆలోచన ఇక్కడి అధికారులు, సిబ్బందిలో కరువవుతోంది. దీంతో అర్జీదారులు జిల్లా కేంద్రంలో నిర్వహించే 'పరిష్కార వేదిక'ను ఆశ్రయిస్తున్నారు. అర్జీల్లో అత్యధికంగా రెవెన్యూకు సంబంధించినవే ఉంటున్నాయి. అటు తరువాత సర్వే, భూరికార్డుల శాఖ, పోలీసు శాఖకు సంబంధించి ఉంటున్నాయి.


ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్ (ఫైల్)

నిర్లక్ష్య ధోరణి... అవినీతి!

మండలస్థాయిలో సమస్యలు పరిష్కారం కాకపోవడానికి ప్రధానంగా కొందరు అధికారులు, సిబ్బందిలో నిర్లక్ష్యధోరణి, అవినీతి కారణమనే విమర్శలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి. సమస్యలు పరిష్కరించండంటూ చుట్టూ తిరిగినా పట్టించుకోవడం లేదంటూ కొందరు.. డబ్బులు డిమాండ్ చేస్తున్నారంటూ మరికొందరు అర్జీ రూపంలో తమ సమస్యతో పాటు ఫిర్యాదును పరిష్కార వేదికలో కలెక్టర్, అధికారులకు దృష్టికి తీసుకొస్తుండటమే ఇందుకు నిదర్శనం.

సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి

ఏస్థాయిలో పరిష్కారం కావాల్సిన సమస్యలు ఆస్థాయిలోనే పరిష్కారం కావాలి. ఇక నుంచి ప్రత్యేకంగా తహసీల్దారు, రెవెన్యూ డివిజన్ కార్యాలయాల్ని తనిఖీ చేస్తాం. వాటి స్థాయిలో పరిష్కారం కావాల్సిన సమస్యలను పరిశీలించి ఎన్ని పరిష్కరించారు.. ఎన్ని పెండింగ్ ఉన్నాయి..ఎందుకు పెండింగ్ పెట్టారు.. అనేదానిపై విచారణ చేస్తాం. అర్జీదారులతో కూడా ఫోన్ ద్వారా మాట్లాడి ఫీడ్‌బ్యాక్ తీసుకుంటాం.

– వి.వినోద్‌కుమార్, కలెక్టర్

క్లుప్తంగా

పీఏబీఆర్‌లో తగ్గుతున్న నీటిమట్టం


పీఏబీఆర్‌లో నిల్వ ఉన్న నీరు

కూడేరు: మండలంలోని పెన్నహోబిలం బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ (పీఏబీఆర్)లో నీటి మట్టం క్రమంగా తగ్గుముఖం పడుతోంది. ఆదివారం నాటికి జలాశయంలో 2.99 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు అధికారులు వెల్లడించారు. ఇన్‌ఫ్లో పూర్తిగా నిలిచిపోయింది. శ్రీసత్యసాయి, అనంత, శ్రీరామరెడ్డి, ఉరవకొండ, కూడేరు తాగునీటి పథకాలకు 55 క్యూసెక్కులు, ధర్మవరం కుడికాలువకు లీకేజీ ద్వారా 35 క్యూసెక్కులు, నీటి ఆవిరి, ఇతర లీకేజీల రూపంలో మరో 40 క్యూసెక్కుల నీరు రోజూ బయటకు వెళుతోంది.

అబ్బుర పరిచిన రాతిగుండు పోటీలు


రాతి గుండు ఎత్తుతున్న కర్ణ

పెద్దవడుగూరు(యాడికి): మండల కేంద్రమైన యాడికి చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం నిర్వహించిన రాతిగుండు ఎత్తు పోటీలు అబ్బుర పరిచాయి. వివిధ రాష్ట్రాలకు చెందిన పది మందికి పైగా పోటీల్లో పాల్గొన్నారు. కర్ణాటకు చెందిన కర్ణ అనే యువకుడు గుండును సునాయాసంగా ఎత్తి మొదటి స్థానాన్ని కై వసం చేసుకున్నాడు. అలాగే రెండో స్థానంలో రాయదుర్గం నివాసి రాజశేఖర్, మూడో స్థానంలో డోన్ మండలం దొరసానిపల్లికి చెందిన చందు నిలిచారు. విజేతలను అభినందిస్తూ నగదు పురస్కారాలతో నిర్వాహకులు సత్కరించారు.

జాతీయ రహదారిపై చైన్ స్నాచింగ్

బుక్కరాయసముద్రం: మండలంలోని 44వ జాతీయ రహదారిపై ఓ మహిళ మెడలోని బంగారు గొలుసును దుండగులు లాక్కెళ్లారు. పోలీసులు తెలిపిన మేరకు... అనంతపురంలోని కళ్యాణదుర్గం రోడ్డులో నివాసముంటున్న రమేష్, వనజ దంపతులు కొంత కాలంగా గార్లదిన్నెలో హోటల్ నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్నారు. ఈ క్రమంలో ఆదివారం వనజ, తన కుమారుడిని స్కూటీ వాహనంపై ఎక్కించుకుని గార్లదిన్నెకు బయలుదేరింది. లోలూరు క్రాస్ వద్దకు చేరుకోగానే 44వ జాతీయ రహదారిపై ద్విచక్ర వాహనంపై వస్తున్న ఇద్దరు యువకులు అడ్రస్ అడిగే నెపంతో వనజ వాహనాన్ని ఆపారు. ఆ సమయంలో ఆమె దృష్టిని ఏమార్చి మెడలోని 3 తులాల బంగారు గొలుసు లాక్కొని ఉడాయించారు. ఘటనపై బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.



వారెవ్వా...

ఫిదా హోగయా!

- నోరూరిస్తున్న అరబ్బుల ప్రత్యేక వంటకం
- జిల్లా వ్యాప్తంగా హలీమ్‌కు పెరుగుతున్న క్రేజ్


గుంతకల్లులో హలీమ్‌ను వడ్డిస్తున్న వ్యాపారి

సమ్‌థింగ్ Special

గుంతకల్లు: రంజాన్ మాసంలో మాత్రమే లభించే అరబ్బుల ప్రత్యేక వంటకం హలీమ్... ప్రస్తుతం హాట్ ట్రెండ్‌గా మారింది. నోరూరించే ఈ వంటకాన్ని తిన్న వారు.. 'వారెవ్వా... ఫిదా హోగయా' అంటూ కితాబునివ్వడం విశేషం. ఒకప్పుడు మహానగరాలకే పరిమితమైన ఈ వంటకం కొన్నేళ్లుగా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పట్టణ ప్రాంతాల్లో అందుబాటులోకి వచ్చింది. అక్కడి నుంచి పార్శిల్ ద్వారా గ్రామీణ ప్రాంతాలకు తయారీదారులు చేరవేస్తున్నారు.

గత పదేళ్లుగా..

గత పదేళ్లుగా ఉమ్మడి జిల్లాలోని గుంతకల్లు, తాడిపత్రి, గుత్తి, కళ్యాణదుర్గం, రాయదుర్గం, కదిరి, హిందూపురం, పెనుకొండ, ధర్మవరం తదితర పట్టణాలతో పాటు అనంతపురం నగరంలోనూ ఆహారప్రియులను హలీమ్ సెంటర్లు విశేషంగా ఆకర్షిస్తున్నాయి. పట్టణ ప్రాంతాల్లో ఒకటి రెండు చొప్పున ఏర్పాటు కాగా, నగరంలో పెద్ద సంఖ్యలో సెంటర్లను నెలకొల్పి కిలోల లెక్కన హలీమ్‌ను సిద్ధం చేస్తున్నారు. ఇందు కోసం హైదరాబాద్ ప్రాంతం నుంచి ప్రత్యేకంగా మాస్టర్లను రంగంలో దించారు. ఇందులో ఉపయోగించే మసాలాలు, ఇతర సుగంధ ద్రవ్యాలను హైదరాబాద్ నుంచే దిగుమతి చేసుకుంటున్నారు.

తయారీకి గంటల సమయం..

చికెన్, మటన్ అనే రెండు రకాల హలీమ్‌ను జిల్లాలో సిద్ధం చేసి విక్రయిస్తున్నారు. దీని తయారీకి ఐదారు గంటలకు పైగా సమయం పడుతుందని తయారీ దారులు అంటున్నారు. స్వచ్ఛమైన నెయ్యి, వెన్న, గోధుమలు, శనగ పప్పు, బార్లీ, జీడిపప్పు, బాదం, షాజీరా, యాలకులతో పాటు ఉల్లిపాయలు, పుదీనా, కొత్తిమీర వంటి దాదాపు 30 రకాల వివిధ రుచికరమైన దినుసులను వినియోగిస్తున్నారు. ప్రత్యేకంగా రూపొందించిన బట్టీలో కట్టెలను మండిస్తూ సిద్ధం చేసుకున్న మసాలా దినుసులతో పాటు బోన్‌లెస్ చికెన్, బోన్‌లెస్ మటన్‌ను వేర్వేరు పాత్రల్లో కలిపి ఐదారు గంటలకు పైగా ఉడికిస్తారు. ఈ క్రమంలో పప్పు గిత్తి తరహాలో పెద్ద పరిమాణంలో ఉన్న గూట కర్రతో తిరగకొడుతూ మెత్తని పేస్ట్‌లా మార్చేస్తారు. ఇలా పేస్ట్‌లా మారిన తర్వాత అందులో నెయ్యి వేసి అంటకాగకుండా కలియతిప్పుతూ విక్రయానికి సిద్ధం చేస్తారు. ప్రాంతాన్ని బట్టి 250 గ్రాముల చికెన్ హలీమ్‌ను రూ.100 నుంచి రూ.200 వరకు, మటన్ హలీమ్‌ను రూ.120 నుంచి రూ.250 వరకు విక్రయిస్తున్నారు.

శ్రమతో కూడుకున్నదే..



హలీమ్ తయారీ అనేది చాలా శ్రమతో కూడుకున్నది. అందుకే కేవలం రంజాన్ మాసాల్లోనే దీనిని ఎక్కువగా చేస్తుంటాం. రుచికరమైన హలీమ్ కోసం ఐదారు గంటలకు పైగా శ్రమించాల్సి ఉంటుంది. ఇందులో వాడే దినుసలన్నీ ఎంతో బలవర్ధకంగా ఉంటాయి.

– బాబా ఫక్రుద్దీన్, హలీమ్ మాస్టర్, గుంతకల్లు

ఆరోగ్యకరం



ఎంతో విశిష్టమైన రంజాన్ మాసాన్ని కఠిన ఉపవాస దీక్షతో ఆచరిస్తుంటాం. ఈ క్రమంలో త్వరగా శరీరం అలసటకు గురై, అనారోగ్యం బారిన పడే ప్రమాదమూ ఉంది. దీంతో ఉపవాస దీక్ష విరమించే సమయంలో తీసుకునే ఖర్జూరాలు మన శరీరానికి అవసరమైన శక్తిని త్వరగా అందిస్తాయి. ఇక హలీమ్ ద్వారా ఎన్నో రకాల పోషకాలు అందుతాయి. దీంతో కఠిన ఉపవాస దీక్షలు చేస్తున్న వారిలో సైతం అలసట అనేది కనిపించదు. – షేక్ మహబుబ్‌బాషా, గుంతకల్లు

ప్రాణాలు బలిగొన్న ఈత సరదా

- కుంటలో ఈతకెళ్లి ఇద్దరు బాలుర మృతి



మృతిచెందిన రిహాన్ అయాన్

హిందూపురం: ఈత సరదా ఇద్దరు చిన్నారులను బలిగొంది. వివరాలు... హిందూపురం సమీపంలోని ఆటోనగర్‌లో నివాసముంటున్న జహీర్ కుమారుడు రిహాన్ (14), సుహేల్, ఉమేరా దంపతుల కుమారుడు అయాన్ (12) స్థానిక పాఠశాలలో 7, 6 తరగతులు చదువుకుంటున్నారు. ఆదివారం పాఠశాలకు సెలవు కావడంతో తోటి స్నేహితులతో కలసి సమీపంలోని నీటి కుంటలో ఈత కొట్టేందుకు వెళ్లారు. లోతైన ప్రాంతానికి వెళ్లడంతో నీట మునిగిపోయారు. పిల్లల కేకలు వేయడంతో చుట్టుపక్కల ఉన్న వారు అక్కడకు చేరుకుని నీట మునిగిన ఇద్దరినీ వెలికి తీశారు. అప్పటికే అపస్మారక స్థితికి చేరుకున్న ఇద్దరినీ వెంటనే స్థానిక ప్రభుత్వాస్పత్రికి చేర్చారు. చికిత్సకు స్పందించక రిహాన్, అయాన్ మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఆటో నగర్ వాసులు పెద్ద సంఖ్యలో ఆస్పత్రికి చేరుకున్నారు. చిన్నారుల మృతదేహాలను చూడగానే కుటుంబసభ్యుల రోదనలు మిన్నంటాయి. ఘటనపై రెండో పట్టణ పీఎస్ సీఐ అబ్దుల్ కరీం కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

బీటెక్ విద్యార్థిని అదృశ్యం

ధర్మవరం అర్బన్: స్థానిక రామనగర్‌కు చెందిన ఓ బీటెక్ విద్యార్థిని కనిపించడం లేదు. అనంతపురం శివారులోని ఓ ప్రైవేట్ ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ ఫైనల్ ఇయర్ చదువుతున్న ఆమె శనివారం ఉదయం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. విద్యార్థిని తండ్రి ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసి, గాలింపు చేపట్టినట్లు రెండో పట్టణ పీఎస్ సీఐ రెడ్డప్ప తెలిపారు.

యువతకు అండగా నిలుద్దాం


సమావేశంలో మాట్లాడుతున్న రమేష్‌గౌడ్ (చిత్రంలో) వివిధ సంఘాల నాయకులు

- వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి రమేష్‌గౌడ్

అనంతపురం కార్పొరేషన్: కూటమి ప్రభుత్వ పాలనలో దగా పడుతున్న యువతకు అండగా నిలిచేందుకు వైఎస్సార్‌సీపీ తలపెట్టిన యువత పోరును జయప్రదం చేద్దామంటూ వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి రమేష్‌గౌడ్ పిలుపునిచ్చారు. ఆదివారం ఐక్య విద్యార్థి, కుల సంఘాల నాయకులతో కలసి అనంతపురంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. డిమాండ్ల సాధనలో భాగంగా ఈ నెల 12న ఉదయం 10 గంటలకు అనంతపురంలోని జెడ్పీ కార్యాలయం నుంచి కలెక్టరేట్ వరకూ పార్టీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకట్రామిరెడ్డి ఆధ్వర్యంలో ర్యాలీ ఉంటుందన్నారు. తాము అధికారంలోకి వస్తే 20 లక్షల ఉద్యోగాలు, నిరుద్యోగ భృతి, తదితర హామీలను నెరవేరుస్తామని ఎన్నికలకు ముందు చంద్రబాబు, లోకేష్ హామీనిచ్చి మోసం చేశారన్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో సచివాలయ వ్యవస్థ ద్వారా 1,35,000 మందికి, వైద్య రంగంలో 75,000 మందికి ఉద్యోగాలను కల్పించిందన్నారు. పేదరికం చదువుకు అడ్డు రాకూడదని ఫీజురీయింబర్స్‌మెంట్‌ను పక్కాగా అమలు చేశారన్నారు. కానీ కూటమి ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించకుండా దగా చేసిందన్నారు. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి రాష్ట్రంలో కేవలం 11 వైద్య కళాశాలలు మాత్రమే ఉండేవని, వైఎస్సార్‌సీపీ ఐదేళ్ల పాలనలో 17 కొత్త వైద్య కళాశాలల ఏర్పాటుకు చర్యలు చేపట్టిందన్నారు. ఇందులో 5 కళాశాలల్లో 2,550 మంది విద్యార్థులకు అడ్మిషన్లు సైతం కల్పించారన్నారు. అయితే కూటమి ప్రభుత్వం కొన్ని కళాశాలలు వద్దని కేంద్రానికి లేఖరాయడమే కాక, మిగిలిన వాటిని ప్రైవేట్ పరం చేయాలనే కుట్ర సాగించడం దుర్మార్గమన్నారు. కార్యక్రమంలో ఏఐఎస్‌బీ జిల్లా ప్రధాన కార్యదర్శి పృథ్వీ, పీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు మంజుల నరేంద్ర, జీవీఎస్ జాతీయ ఉపాధ్యక్షులు మల్లికార్జున నాయక్, ఎస్సీ జనసంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు కుళ్లాయప్ప, ఏఐఎస్‌బీ జిల్లా అధ్యక్షుడు బిల్లే జగదీష్, ఎస్వీఎస్ఎఫ్‌బీసీ చక్రధర్ యాదవ్, ఎంఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జేన్నే చిరంజీవి, బీసీ ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు కేశవ గౌడ్, జీపీఎస్ జిల్లా అధ్యక్షులు సాకే ఆనంద్, వైఎస్సార్ విద్యార్థి విభాగం నగరాధ్యక్షుడు కైలాష్ తదితరులు మాట్లాడారు. వైఎస్సార్‌సీపీ చేపడుతున్న ఆందోళనను జయప్రదం చేస్తామన్నారు.

యువతపోరు విజయవంతం చేద్దాం

- మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి


మాట్లాడుతున్న విశ్వేశ్వరరెడ్డి

బెళుగుప్ప: నిరుద్యోగ యువత, విద్యార్థుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ఈ నెల 12న వైఎస్సార్‌సీపీ తలపెట్టిన యువతపోరు కార్యక్రమాన్ని విజయవంతం చేద్దామంటూ ఆ పార్టీ ఉరవకొండ నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి పిలుపునిచ్చారు. బెళుగుప్ప మండలం కాలువపల్లిలో వైఎస్సార్‌సీపీ మండల బీసీ సెల్ అధ్యక్షుడు వెంకటేశులు స్వగృహంలో ఆదివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నిరుద్యోగ భృతికి బడ్జెట్‌లో నిధులు కేటాయించకుండా ప్రభుత్వం మొండి చెయ్యి చూపిందన్నారు. ఇంట్లో ఎంతమంది విద్యార్థులు ఉంటే అంతమందికి తల్లికి వందనం పేరుతో ఒక్కొక్కరికి రూ.15 వేలు చొప్పున ఇస్తామని గత ఎన్నికల సమయంలో చంద్రబాబు ఇచ్చిన హామీకి దిక్కు లేదన్నారు. ఇలాంటి మోసాలపై ప్రభుత్వాన్ని నిలదీయాలన్నారు. ఈ నెల 12న కలెక్టరేట్ ఎదుట తలపెట్టిన ఆందోళన కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో విద్యార్థులు, యువకులు, నిరుద్యోగులు పాల్గొనాలని కోరారు.

కుప్పంకు నీటిని తరలించేందుకే హంద్రీనీవా లైనింగ్ పనులు..

కేవలం కుప్పం ప్రాంతానికి నీటిని తరలించాలనే లక్ష్యంతో జిల్లా రైతుల ఆశలకు శాశ్వతంగా సమాధి కడుతూ హంద్రీనీవా కాలువకు లైనింగ్ పనులను రాష్ట్ర ప్రభుత్వం చేపడుతోందని విశ్వ మండిపడ్డారు. జిల్లా రైతుల సంక్షేమాన్ని సీఎం చంద్రబాబు పూర్తి విస్మరించారన్నారు. లైనింగ్ పనులు పూర్తయితే భూగర్భజలాలు అడుగంటి ఉద్యాన పంటలు పూర్తిగా దెబ్బతింటాయన్నారు. తక్షణమే లైనింగ్ పనులు ఆపడమే కాక జిల్లాలోని 3.5 లక్షల ఎకరాలకు సాగునీరు అందించాలని డిమాండ్ చేశారు. హంద్రీనీవా పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో చేపట్టే ప్రతి కార్యక్రమానికీ పార్టీలకు అతీతంగా రైతులందరూ బాసటగా నిలవాలని పిలుపునిచ్చారు. సమావేశంలో బీసీ సెల్ అధికార ప్రతినిధి వీరన్న, సర్పంచ్ పెద్దన్న, డీసీసీబీ మాజీ డైరెక్టర్ శివలింగప్ప, అంకంపల్లి సర్పంచ్ రుద్రానంద, మాజీ సర్పంచ్ తిమ్మన్న, పార్టీ సీనియర్ నాయకులు మోహన్, శ్రీనివాసరెడ్డి, చందూ, కృష్ణారెడ్డి, మధుసూదన్‌రెడ్డి, తిప్పేస్వామి, వెంకటేశులు తదితరులు పాల్గొన్నారు.

కూటమి దగాపై కదం తొక్కాలి


మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి

- 12న 'యువత పోరు'కు భారీగా తరలిరావాలి
- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత పిలుపు

అనంతపురం కార్పొరేషన్: విద్యార్థులు, నిరుద్యోగులను దగా చేస్తున్న కూటమి ప్రభుత్వానికి బుద్ధి చెప్పేందుకు ఈ నెల 12న వైఎస్సార్‌సీపీ తలపెట్టిన 'యువత పోరు'లో కదం తొక్కాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం నగరంలోని వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో యువజన విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 12న ఉదయం 10 గంటలకు జెడ్పీ కార్యాలయం వద్ద నుంచి కలెక్టరేట్ వరకూ ర్యాలీ ఉంటుందన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, నిరుద్యోగ భృతి, ప్రభుత్వ వైద్య కళాశాలల నిర్వహణ అంశాలపై చంద్రబాబు ప్రభుత్వం అవలంబిస్తున్న నిర్లక్ష్య ధోరణిపై కలెక్టర్‌కు వినతి పత్రం అందజేస్తామన్నారు. ర్యాలీలో యువత భారీగా పాల్గొనాలని కోరారు. కూటమి ప్రభుత్వం వచ్చి 9 నెలలు అవుతున్నాఒక్క హామీని పూర్తిగా నెరవేర్చలేదన్నారు. పైగా రూ.1.30 లక్షల కోట్ల అప్పుల భారాన్ని ప్రజలపై మోపిందన్నారు. 'తల్లికి వందనం' తొలి ఏడాది ఎగనామం పెట్టారన్నారు. ఉన్నత విద్యను అభ్యసించే విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించకుండా సీఎం చంద్రబాబు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. 20 లక్షల మందికి ఉద్యోగాలు, నిరుద్యోగ భృతి రూ.3 వేలు ఇస్తామని యువతను మోసం చేశారని విమర్శించారు. వైఎస్ జగన్ హయాంలో 17 ప్రభుత్వ వైద్య కళాశాలలకు శ్రీకారం చుడితే వాటిని ప్రైవేట్ పరం చేసేందుకు కూటమి ప్రభుత్వం సిద్ధమవుతోందని దుయ్యబట్టారు. యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు సాకే చంద్రశేఖర్ మాట్లాడుతూ.. ప్రభుత్వం మెడలు వంచైనా యువతకు అండగా నిలుస్తామన్నారు. యువత భవిష్యత్తును ప్రశ్నార్థకంగా మారుస్తున్న సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేష్‌కు బుద్ధి చెప్పే రోజులు దగ్గర్లోనే ఉన్నాయన్నారు. కార్యక్రమంలో వివిధ నియోజకవర్గాల యువజన విభాగం నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

లక్ష్యానికి చేరువలో 'మార్కెటింగ్'

అనంతపురం అగ్రికల్చర్: ఈ నెలాఖరుతో ముగియనున్న 2024–25 ఆర్థిక సంవత్సరానికి గాను నిర్దేశించిన లక్ష్యసాధనకు మార్కెట్ కమిటీలు చేరవవుతున్నాయి. ఈ ఏడాది రెండో త్రైమాసికం వరకూ మొదటి రెండు స్థానాల్లో నిలిచిన అనంతపురం, శింగనమల మార్కెట్ కమిటీలను దాటుకుని రాయదుర్గం కమిటీ టాప్ ప్లేస్‌లోకి వచ్చింది. ఈ యార్డులో రూ.1.44 కోట్లకు గానూ 11 నెలలకే 102 శాతంతో రూ.1.46 కోట్లు వసూలు కావడం గమనార్హం. శింగనమల 91 శాతం, అనంతపురం 84 శాతం, గుత్తి 82 శాతం, గుంతకల్లు 78 శాతం, కళ్యాణదుర్గం 71 శాతంతో లక్ష్యం దిశగా పయనిస్తున్నాయి. లక్ష్య సాధనలో రాప్తాడు, 57 ఉరవకొండ మార్కెట్ కమిటీలు వెనుకపడ్డాయి.

రవాణాశాఖ ఉద్యోగుల సంఘం నూతన కమిటీ ఎంపిక

కడప వైఎస్సార్ సర్కిల్: రవాణాశాఖలో రాయలసీమ స్థాయి నాన్ టెక్నికల్ ఎంప్లాయిస్ అసోసియేషన్ (ఏపీటీడీ ఎన్‌టీఈఏ)కు సంబంధించిన కమిటీని ఆదివారం కడపలో ఎన్నుకున్నారు. సీమ అధ్యక్షుడిగా వైఎస్సార్ జిల్లా ప్రొద్దుటూరు కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న పెద్దిరెడ్డి లక్ష్మీకర్‌రెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉమ్మడి జిల్లాకు సంబంధించి కమిటీ సభ్యుల్లో జోన్ వైస్ ప్రెసిడెంట్–1గా కె.సువర్ణకుమారి (అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్, అనంతపురం), జోన్ ట్రెజరర్‌గా ఎన్.రవిప్రకాష్ (సీనియర్ అసిస్టెంట్, హిందూపురం)కు చోటు దక్కింది. నూతనంగా ఎన్నికైన సభ్యులను ఆ శాఖ ఉద్యోగులు అభినందించారు.

ఉమ్మడి జిల్లా కబడ్డీ జట్ల ఎంపిక


రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైన క్రీడాకారులతో అసోసియేషన్ నాయకులు

గుంతకల్లు: ఈ నెల 14 నుంచి 16వ తేదీ వరకు వైఎస్సార్ జిల్లా పులివెందుల వేదికగా జరిగే రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీల్లో ప్రాతినిధ్యం వహించే ఉమ్మడి అనంతపురం జిల్లా బాల, బాలికల కబడ్డీ జట్లను ఆదివారం గుంతకల్లులోని రైల్వే గ్రౌండ్‌లో ఎంపిక చేశారు. ఈ మేరకు అనంతపురం జిల్లా కబడ్డీ అసోసియేషన్ సెక్రటరీ లక్ష్మణ్, సెలక్షన్ కమిటీ సభ్యుడు రాఘవేంద్ర తెలిపారు. బాలికల విభాగంలో విష్ణు ప్రియ (అనంతపురం), వర్ష (ప్రసన్నాయపల్లి), నవ్యశ్రీ (తాడిపత్రి), సుచరిత (ఎస్కేయూ), జాను (చిన్మయనగర్), వర్షియా (తాడిపత్రి), హిమవతి (కొర్రపాడు), ప్రణతి (కూడేరు), షాజియా (ధర్మవరం) అనుశ్రీ (విడపనకల్లు), కీర్తన (ప్రసన్నాయపల్లి), తాడిపత్రికి చెందిన యజ్ఞ, నందిని చోటు దక్కించుకున్నారు. బాలురు విభాగానికి లోకేష్ (కొకుంట్ల), మహమ్మద్ ఆసీఫ్ (ధర్మవరం), మహమ్మద్ ఉస్మాన్ (తాడిపత్రి), మల్లికార్జున (గుంతకల్లు), వరుణ్‌కుమార్ (బొమ్మనహళ్), పవన్‌కుమార్ (అనంతపురం), సునీల్ కుమార్ (గుంతకల్లు), చరణ్ (అనంతపురం), రాజు (అనంతపురం), వేణు (వైటీ చెరువు). హర్షవర్ధన్ (తాడిపత్రి), ఏసురాజు (ధర్మవరం), విశ్వసందేష్ (అనంతపురం) ఎంపికయ్యారు.

'వెలుగు'లో టీడీపీ నేత చిచ్చు

- టీడీపీ నేత చెబితే చేసి తీరాల్సిందేనంటూ స్వామి భక్తి చాటిన ఏపీఎం
- సీసీల సంతకం లేకుండానే రుణాలు మంజూరు చేసిన వైనం
- నాలుగు గోడల మధ్య పరస్పర దూషణలతో రెచ్చిపోయిన వెలుగు సిబ్బంది



కుందుర్పి: స్వలాభం కోసం వెలుగు పథకంలో పనిచేస్తున్న ఏపీఎం, సీసీల మధ్య ఓ టీడీపీ నేత చిచ్చు రగిల్చాడు. ఇది కాస్త దావాలనమై కార్యాలయం నాలుగు గోడల మధ్య రెండు రోజుల క్రితం భగ్గున మండింది. పరస్పర దూషణలతో ఏపీఎం, సీసీ రెచ్చిపోయారు. కుందుర్పి మండల వెలుగు కార్యాలయంలో ఈ ఘటన చోటు చేసుకుంది. ఇందుకు సంబంధించిన ఆడియో వైరల్ కావడంతో టీడీపీ నేత బండారం బట్టబయలైంది.

ఏం జరిగిందంటే..

కుందుర్పి మండలంలో పనిచేస్తున్న ఏపీఎం సర్దానప్ప తీరుతో గత రెండు రోజులుగా మండల సమాఖ్య కార్యాలయంలో పెద్ద వివాదం నెలకొంది. పలు గ్రామాలకు చెందిన సంఘాల సభ్యులకు సంబంధించి రుణాల మంజూరుకు సీసీలు ప్రతిపాదనలు సిద్ధం చేసి ఏపీఎం దృష్టికి పంపారు. అయితే దీనిపై ఏపీఎం అభ్యంతరం వ్యక్తం చేస్తూ స్థానిక టీడీపీ నేత సూచించిన వైఎస్సార్‌సీపీ సానుభూతిపరుల దరఖాస్తులను తిరస్కరించారు. దీనిపై సీసీలను బాధిత సభ్యులు నిలదీయడంతో ఇందులో తమ ప్రమేయం లేదని చేతులెత్తేశారు. రుణాల మంజూరు అంశం ఏపీఎం పరిధిలో ఉంటుందని సమాధానమిచ్చారు.

కుర్చీలు విసురుకుని...

రుణాల అంశంలో అన్యాయానికి గురైన పలువురు సభ్యులు రెండు రోజుల క్రితం వెలుగు కార్యాలయంలో ఏపీఎం, సీసీలను నిలదీశారు. అందరి సమక్షంలో ఏపీఎం తీరుపై అసహనం వ్యక్తం చేశారు. మండుటెండలో చెమటోడ్చి పనులు చేస్తున్నది టీడీపీ నేత కాదనే విషయాన్ని దృష్టిలో ఉంచుకోవాలని హితవు పలికారు. వివక్ష మాని అందరినీ సమదృష్టి చూడాలని, లేకపోతే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. దీంతో అక్కడే ఉన్న సీసీ తిమ్మప్పపై ఏపీఎం సర్దానప్ప తీవ్ర స్థాయిలో మండిపడ్డాడు. టీడీపీ నేత చెబితే పనిచేసి తీరాల్సిందేనని, తాను టీడీపీ నేత మాట వినప్పుడు మీరెందుకు వినరంటూ సీసీపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ సమయంలో ఇద్దరి మధ్య మాటల యుద్ధం తారస్థాయికి చేరుకుంది. నువ్వెంతంటే.. నువ్వెంత అని దూషించుకుంటూ కుర్చీలను విసిరారు. అక్కడే ఉన్న స్త్రీ నిధి మేనేజర్ గోవిందు జోక్యం చేసుకుని సర్దిచెప్పారు.

సీసీలు ఏమంటున్నారంటే..

ఘటనకు సంబంధించి పలువురు సీసీలు మాట్లాడుతూ.. తమ సంతకాలు లేకుండానే టీడీపీ నాయకులు చెప్పిన వారికి రుణాలు చేస్తానని ఏపీఎం సర్దానప్ప చెబుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నిబంధనలు ఉల్లంఘిస్తూ తమ సంతకాలు లేకుండానే టీడీపీ కార్యకర్తల కుటుంబసభ్యులకు ఏపీఎం రుణాలు మంజూరు చేయడం వివాదానికి కారణమైందన్నారు.

ఇదేం పెద్ద సమస్య కాదు

'ఔను వాళ్లిద్దరూ వాదులాడుకున్నారు. కార్యాలయంలోనే గొడవ పడ్డారు. ఈ విషయంగా వారిని ఎమ్మెల్యే అల్లుడు ధర్మతేజ పిలిపించి మందలించాడు. ఆ సమయంలో నేను విజయవాడలో ఉన్నా. సోమవారం కార్యాలయానికి ఏపీఎం, సీసీలను పిలిపించుకుని మాట్లాడుతాను. ఇదేం పెద్ద సమస్య కాదు'.

– నారాయణస్వామి, ఏరియా కో ఆర్డినేటర్, వెలుగు, కళ్యాణదుర్గం

క్లుప్తంగా

ఉచిత వివాహ పరిచయ వేదిక



వివాహ పరిచయ వేదికకు హాజరైన యువతీ, యువకులు తల్లిదండ్రులు

రాప్తాడురూరల్: రాయలసీమ రెడ్డి జన సంఘం ఆధ్వర్యంలో ఆదివారం అనంతపురం రూరల్ పాపంపేటలోని సంఘం కార్యాలయంలో నిర్వహించిన ఉచిత రెడ్డి వివాహ పరిచయ వేదిక విజయవంతమైంది. 148 మంది అబ్బాయిలు, అమ్మాయిల తల్లిదండ్రులు హాజరయ్యారు. ఈ సందర్భంగా సంఘం వ్యవస్థాపకుడు రొద్దం సురేష్‌రెడ్డి మాట్లాడుతూ.. ఎలాంటి రుసుం వసూలు చేయకుండా కేవలం సేవాభావంతో ఉచితంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతి నెలా 2వ శనివారం ఈ వేదిక ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. తల్లిదండ్రుల నుంచి మంచి స్పందన లభిస్తోందన్నారు. సంఘం కార్యాలయానికి పంపనూరు దుబ్బ చంద్రశేఖర్‌రెడ్డి 50 కుర్చీలు వితరణ చేశారు. కార్యక్రమంలో సంఘం గౌరవాధ్యక్షులు చిన్నరాసి చంద్రమౌళి రెడ్డి, దుబ్బ కిషోర్‌రెడ్డి, తోపుదుర్తి రామకృష్ణా రెడ్డి, మంత్రి విశ్వనాథరెడ్డి, కోన వెంకటశివా రెడ్డి, దయానందరెడ్డి, రిటైర్డ్ ఏఎస్ఐ చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

వీహెచ్‌పీ ఆధ్వర్యంలో నేడు ర్యాలీ

అనంతపురం కల్చరల్: రాయచోటిలో హిందువులపై జరిగిన సంఘటనను నిరసిస్తూ విశ్వ హిందూ పరిషత్తు ఆధ్వర్యంలో సోమవారం ర్యాలీ చేపట్టనున్నారు. నగరవీధుల్లో మానవ హారం అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తామని వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు తాళంకి రత్నమయ్య తెలిపారు. స్థానిక కృష్ణకళా మందిరం నుంచి వివిధ హిందుత్వ సంస్థల ప్రతినిధుల ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీ జరుగుతుందని పేర్కొన్నారు. అందరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

బంగారు కొనుగోలుకు రుణాలు

అనంతపురం అగ్రికల్చర్: మహిళల ఆర్థిక పురోగతి లక్ష్యంగా టౌన్ బ్యాంకు ద్వారా బంగారు కొనుగోలుకు మహిళలకు రుణాలు ఇవ్వనున్నట్లు బ్యాంకు చైర్మన్ జేఎల్ మురళీధర్ తెలిపారు. ఆదివారం స్థానిక బ్యాంకు ప్రధాన కార్యాలయం హాలులో సీఈఓ విజయభాస్కర్ అధ్యక్షతన అనంతపురం కో–ఆపరేటివ్ అర్బన్ బ్యాంకు 109వ మహాజన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ.. ప్రభుత్వ, ప్రైవేట్ బ్యాంకులకు దీటుగా ఖాతాదారులకు అన్ని విధాలుగా టౌన్ బ్యాంకు ద్వారా రుణాలు అందిస్తున్నట్లు తెలిపారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని కొత్తగా మహిళలకు బంగారు కొనుగోలుకు అవసరమైన రుణాలు ఇస్తామన్నారు. నిరర్థక ఆస్తులు (ఎన్‌పీఏ) బాగా తగ్గించి బ్యాంకు ఆర్థిక పురోగతి కోసం కృషి చేశామన్నారు. డిపాజిట్లపై అత్యధిక వడ్డీరేట్లు, డివిడెంట్, వివాహాలు, విద్యకు అవసరమైన రుణాలు ఇస్తూ అన్ని వర్గాల్లో ఆర్థిక భరోసా కల్పించామని తెలిపారు. మరోపక్క సామాజిక సేవా కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు పేర్కొన్నారు. రానున్న 2025–26 ఆర్థిక బడ్జెట్‌పై చర్చించారు. కార్యక్రమంలో బ్యాంకు పాలక వర్గ సభ్యులు జె.వెంకటాద్రి, గోల్డ్ బాషా, బి.రమణయ్య, సుంకర రమేష్, జే.రామాంజనేయులు, ఎం.చంద్రశేఖర్ పాల్గొన్నారు.

తోటలో దొంగలు పడ్డారు



కేబుల్ ఎత్తుకెళ్లడంతో ఖాళీగా కనిపిస్తున్న విద్యుత్ స్తంభాలు

రాప్తాడురూరల్: అనంతపురం రూరల్ మండలం రాచానపల్లి గ్రామ శివారులోని ఓ తోటలో దొంగలు తెగబడ్డారు. దాదాపు 320 మీటర్ల కరెంటు కేబుల్, స్టార్టర్ పెట్టెను ఎత్తుకెళ్లారు. వివరాలు.. అనంతపురం నగరానికి చెందిన శ్రీనివాసులుకు బళ్లారి రోడ్డులో సిప్లాన్ ఫ్యాక్టరీ వెనుక 6.55 ఎకరాల భూమి ఉంది. కరెంటు సదుపాయం లేకపోవడంతో ట్రాన్స్‌ఫార్మర్ నుంచి తన తోట వరకు 6 పోళ్లు నాటించాడు. సుమారు 320 మీటర్ల వరకు కరెంటు కేబుల్ ఏర్పాటు చేశాడు. ఇటీవల కంది పంట సాగు చేసి పంట దిగుబడి కూడా తీసుకున్నాడు. అలాగే ట్రాన్స్‌ఫార్మర్ మీద ఉండే జంపర్ల వైరు తెగిపోవడంతో ఈయన తోటకు కరెంటు సరఫరా ఆగిపోయింది. దీనిపై బాధితుడు విద్యుత్ అధికారులకు ఫిర్యాదు కూడా చేశాడు. రోజులు గడిచి పోయినా పట్టించుకోలేదు. కరెంటు సరఫరా లేదనే సమాచారం తెలుసుకున్న దొంగలు వైరు ఎత్తుకెళ్లేందుకు ప్రణాళిక రచించారు. వైరుతో పాటు స్టార్టర్ పెట్టెను ఎత్తుకెళ్లారు. చోరీపై బాధితుడు ట్రాన్స్‌కో అధికారులకు ఫిర్యాదు చేశాడు. కలెక్టర్, ఎస్పీని కలిసి కూడా ఫిర్యాదు చేస్తానన్నారు. కాగా.. ట్రాన్స్‌ఫార్మర్ మీద ఉండే జంపర్ల వైరు తెగిపోయిన సమాచారం దొంగల దృష్టికి ఎలా వెళ్లిందనే దానిపై అనుమానాలు తలెత్తుతున్నాయి.

పేదల బియ్యం.. డీలర్ల భోజ్యం

- 20 కిలోలకు 16, 15 కిలోలకు 12 కిలోలే పంపిణీ
- స్టాకు పాయింట్‌పై నెట్టేస్తున్న డీలర్లు
- ఆవేదన వ్యక్తం చేస్తున్న కార్డుదారులు



రాప్తాడులో రేషన్ సరుకుల కోసం బారులు తీరిన కార్డుదారులు

రాప్తాడు: పేదలకు చౌక దుకాణాల నుంచి ఉచితంగా అందించే రేషన్ బియ్యం సరఫరాలో దోపిడీ జరుగుతోంది. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత డీలర్లు పేదలకు రేషన్ సరుకులు సక్రమంగా పంపిణీ చేయకుండా కేవలం ఆదాయ మార్గాలపై దృష్టి సారిస్తున్నారు. రెండు మూడు కోటాలు సక్రమంగా పంపిణీ చేసిన తర్వాత కోతలు మొదలు పెట్టారు. రాప్తాడు మండలంలో రాప్తాడు, లింగనపల్లి, బొమ్మేపర్తి, మరూరు, గొందిరెడ్డిపల్లి, ఆత్మకూరు మండలంలో తోపుదుర్తి, ముట్టాల, సనప, చెన్నేకొత్తపల్లి మండలంలో మేడాపురం, నాగసముద్రం, న్యామద్దల, కనగానపల్లి మండలంలో మద్దెల చెరువు, తగరకుంట, తూంచెర్ల తదితర గ్రామాల్లో బియ్యాన్ని తక్కువగా ఇస్తున్నారని కార్డుదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. 25 కేజీలు ఇవ్వాల్సిన వారికి 21 కేజీలు, 20 కేజీలు ఇవ్వాల్సిన వారికి 16 కేజీలు, 15 కేజీలు ఇవ్వాల్సిన వారికి 12 కేజీలు మాత్రమే ఇవ్వడంతో డీలర్లపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నియోజకవర్గంలోని మారుమూల ప్రాంతాలతో పాటు తండాలు ఉన్నాయి. చాలా మంది పనుల కోసం ఇతర ప్రాంతాలకు వలసలు వెళ్లారు. రేషన్ సరుకుల కోసం ప్రతి నెలా వారు గ్రామాలకు వచ్చి వెళ్తుంటారు. అలాంటి వారికి తూకాల్లో తక్కువ రావడంతో అసహనం వ్యక్తం చేస్తున్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో బియ్యంతో పాటు కంది బేడలు, నూనె, చక్కెర, బెల్లం, రాగులు, జొన్నలు ఇవ్వగా కూటమి ప్రభుత్వంలో కేవలం బియ్యం, చక్కెర మాత్రమే ఇస్తున్నారు.

రెచ్చిపోతున్న డీలర్లు



రాప్తాడులో 20 కేజీల బియ్యానికి 16 కేజీలు ఇచ్చిన దృశ్యం

ఈనెల కోట బియ్యం తక్కువగా వచ్చింది.. ఈనెల తంబు వేస్తేనే మళ్లీ నెల బియ్యం ఇస్తాం.. లేదంటే మళ్లీ నెల బియ్యం కూడా ఇవ్వం అంటూ రాప్తాడులో ఓ డీలర్ కార్డుదారులను భయభ్రాంతులకు గురి చేస్తున్నాడు. బియ్యం ఇవ్వనిదే తంబు ఎలా వేస్తామంటూ కార్డుదారులు ప్రశ్నిస్తే.. నోరు మూసుకుని తంబు వేసి ఇంటికి వెళ్లండి.. లేదంటే బియ్యం ఇచ్చేది లేదు. ఎవరికి చెప్పుకుంటారో చెప్పుకోండి అంటూ బెదిరిస్తున్నాడు. దాదాపు 30 మంది కార్డుదారులు చేసేది ఏమీ లేక తంబు వేసి ఇంటికి వెళ్లారు. గత ప్రభుత్వంలో ఇలా జరగలేదని.. ఈ ప్రభుత్వంలో తంబు వేపించుకుని బియ్యం లేవంటూ తమపై డీలర్ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాడని చెబుతున్నారు.

రాప్తాడు నియోజకవర్గంలో రేషన్ షాపుల వివరాలు		
మండలం	రేషన్ షాపులు	రేషన్ కార్డుల సంఖ్య
రాప్తాడు	32	12,579
ఆత్మకూరు	34	12,362
అనంతపురం రూరల్	77	41,507
రామగిరి	32	11,006
కనగానపల్లి	34	13,530
చెన్నేకొత్తపల్లి	46	14,624

తప్పెవరిది?

డీలర్లేమో తమకు స్టాకు పాయింట్ నుంచి ప్రతి నెలా తక్కువ తూకాలు వస్తున్నాయని అంటున్నారు. స్టాకు పాయింట్ అధికారులు ఏమో కచ్చితమైన తూకాలతో గ్రామాలకు రేషన్ బియ్యాన్ని సరఫరా చేస్తున్నామని చెబుతున్నారు. అయితే రేషన్ సరుకులు కార్డుదారులకు సక్రమంగా పంపిణీ చేస్తున్నారా? లేదా అనే దానిపై అధికారులు ఎక్కడా తనిఖీలు చేసినట్లు కనిపించడం లేదు.

వచ్చే నెల ఇస్తామన్నారు



ఈనెల రేషన్ సరుకులకు రాప్తాడులోని ఓ రేషన్ షాపుకు వెళ్లాను. అక్కడ నాతో పాటు దాదాపు 20 మంది కార్డుదారులతో డీలర్ తంబు వేపించుకుంది. ఈనెల స్టాకు తక్కువగా వచ్చిందని.. వచ్చే నెలలో రెండు నెలల కోటా బియ్యం ఒకే సారి ఇస్తానని చెప్పింది. వచ్చే నెలలో గత నెలకు సంబంధించిన కోటా బియ్యం ఇస్తుందో లేదో అర్థం కావడం లేదు. ఒక వేళ గత నెల నేను బియ్యం ఇచ్చాను అని చెబితే ఏమి చేయాలో తెలియడం లేదు. మాలాంటి పేదలకు ఇలా చేస్తే ఎలా..

– శకుంతల, రాప్తాడు

బియ్యం తక్కువ ఇస్తున్నారు



రాప్తాడులో ఓ రేషన్ షాపులో 20 కేజీల బియ్యానికి కేలవం 16 కేజీల బియ్యం మాత్రమే ఇస్తున్నారు. తూకం మిషన్‌పై ఇనుప డబ్బా ఉంచి బియ్యం వేస్తున్నారు. ఇనుప డబ్బాను లెస్ చేయాలని చెబితే.. ఆ డీలర్ భర్త నేను బియ్యం వేసేది ఇలానే.. తీసుకుంటే తీసుకో లేదంటే బయటకు వెళ్లు అని చెబుతున్నాడు. ఈ నెల కోటా బియ్యం కోసం వెళ్లగా బియ్యం అయిపోయాయి అంటూ తెగేసి చెబుతున్నాడు. ఈ విషయంపై నాలుగు నెలల క్రితమే కలెక్టర్‌కు ఫిర్యాదు చేశాం. అయినా ఆ డీలర్‌పై ఎటువంటి చర్యలు తీసుకోలేదు.

– లక్ష్మన్న, మాజీ డీలర్, రాప్తాడు

బియ్యం తక్కువ ఇస్తే చర్యలు



కార్డుదారులకు ఎవరికైనా డీలర్లు తక్కువగా బియ్యం ఇస్తున్నారని తమకు ఫిర్యాదు చేస్తే ఆ డీలర్‌పై కఠిన చర్యలు తీసుకుంటాం. బియ్యం తక్కువగా ఇస్తున్నారని మాకు ఎవరూ కార్డుదారులు ఫిర్యాదు చేయలేదు. స్టాక్ పాయింట్ నుంచి కూడా బియ్యం తక్కువగా వస్తున్నాయని డీలర్లు కూడా ఫిర్యాదు చేయలేదు. తంబు వేసిన వెంటనే ప్రతి డీలర్ కార్డుదారుడికి నిత్యావసర వస్తువులు పంపిణీ చేయాలి. మళ్లీ నెల ఇస్తామని తంబు వేపించుకుని నిత్యావర వస్తువులు ఇవ్వకపోవడం నేరం అవుతుంది.

– విజయకుమారి, తహసీల్దార్, రాప్తాడు

పట్టుదలతో కృషి చేస్తే ఏదైనా సాధ్యమే



మాట్లాడుతున్న అసిస్టెంట్ కలెక్టర్ వినూత్న



ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమం

అనంతపురం కల్చరల్: పట్టుదలతోనే ఉన్నత స్థాయికి చేరుకోగలమని అసిస్టెంట్ కలెక్టర్ వినూత్న అన్నారు. ఆదివారం లలిత కళాపరిషత్తులో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని అనంత మహిళా సదస్సు నిర్వహించారు. ఈ సమావేశానికి సీనియర్ న్యాయవాది పద్మజ అధ్యక్షత వహించారు. స్థానిక కృష్ణామందిరం నుంచి లలిత కళాపరిషత్తు వరకు ప్లకార్డులు చేతబట్టి నినాదాలతో భారీ ర్యాలీ చేపట్టారు. ప్రజానాట్యమండలి కళాకారులు, జేవీవీ గాయకులు సందేశాత్మక గేయాలు, నాట్యాచార్యులు సంధ్యామూర్తి శిష్యబృందం చైతన్య గేయరూపకం, కోలాటాలతో సభికులను మంత్ర ముగ్దులను చేశారు. అనంతరం పలువురు మాట్లాడుతూ.. సమాన హక్కులు అమలయ్యే వరకు మహిళా లోకం ఐక్యపోరు సాగించాలని సూచించారు. స్వాతంత్య్రం వచ్చి ఇన్నేళ్లయినా సమాన హక్కులు లేవన్నారు. విద్య, విజ్ఞానం సమాజంలో మంచి గుర్తింపు తెస్తాయని పేర్కొన్నారు. అనంతరం పలు రంగాల్లో సేవలందిస్తున్న ఆటోడ్రైవర్లు, కార్మికులు, జొమాటో, ఆశావర్కర్లు, అంగన్‌వాడీ టీచర్లు 108లో పని చేస్తున్న సామాన్య మహిళలను సత్కరించారు. సర్టిఫికెట్లు, చీరలు అందజేశారు. కార్యక్రమంలో ప్రఖ్యాత సామాజికవేత్త దేవి, ఐద్వా రాష్ట్ర నాయకురాలు సావిత్రి, ప్రముఖ వైద్యులు బాలా కుమారి, ఎండ్లూరి ప్రభాకర్, జేవీవీ నాయకులు డాక్టర్ ప్రసూన, డాక్టర్ హేమలత, ప్రాంగణం అధికారి వనజా అక్కమ్మ, బృంద, కెనరా బ్యాంకు రీజనల్ మేనేజర్ యాదయ్య, ఇన్నర్‌వీల్ ప్రతినిధులు జయంతి, శ్రీవల్లి, రెడ్స్ సంస్థ అధ్యక్షురాలు భానూజ, సందీప్ కుమార్, ఐద్వా ప్రతినిధులు చంద్రిక, రామాంజనమ్మ, యూటీఎఫ్ నాయకురాలు సరళ, చెట్ల ఈరన్న పాల్గొన్నారు.

యువత పోరు విజయవంతం చేద్దాం



మాట్లాడుతున్న మేయర్ వసీం

అనంతపురం కార్పొరేషన్: ఫీజురీయింబర్స్‌మెంట్, నిరుద్యోగ భృతి, లక్షల్లో ఉద్యోగాలు ఇస్తామన్న కూటమి ప్రభుత్వం.. 9 నెలలు గడుస్తున్నా హామీలను అమలు చేయలేదని మేయర్ వసీం ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం తన క్యాంపు కార్యాలయంలో మేయర్ విలేకరులతో మాట్లాడారు. ఈనెల 12న నగరంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి ఆధ్వర్యంలో జరగనున్న యువత పోరును విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. పేద విద్యార్థులు బాగు పడాలనే ఆలోచన కూటమి ప్రభుత్వానికి ఎక్కడా లేదన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 11 లక్షల మంది విద్యార్థులు ఇబ్బందులు పడేలా సీఎం చంద్రబాబు సర్కార్ వ్యవహరిస్తోందన్నారు. ఫీజు రీయంబర్స్‌మెంట్, వసతి దీవెన తదితర వాటి కోసం ఐదేళ్ల పాలనలో వైఎస్ జగన్ రూ.26 వేల కోట్లు ఖర్చు చేశారన్నారు. ఇంగ్లిష్ మీడియంను ప్రవేశపెడితే దాన్ని అప్పట్లో చంద్రబాబు అడ్డుకునే ప్రయత్నంలో భాగంగా కోర్టులకు వెళ్లిన సందర్భాలను గుర్తు చేశారు. డీఎస్సీకి తొలి సంతకం చేసినా.. ఇంత వరకు అతీగతీ లేకుండా పోయిందన్నారు. బడ్జెట్‌లో నిరుద్యోగ భృతి ఊసేలేదని మండిపడ్డారు. సమావేశంలో ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు మల్లెమీద నరసింహులు, కార్పొరేటర్లు కమల్ భూషణ్, రహంతుల్లా, సాకే చంద్రలేఖ, నాయకులు దాదు, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వం బాధ్యత తీసుకోవాలి



డిప్యూటీ మేయర్ కోగటం

అనంతపురం కార్పొరేషన్: యువతకు అండగా నిలిచేలా కూటమి ప్రభుత్వం బాధ్యత తీసుకోవాలి. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్ రెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం తన క్యాంపు కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఈనెల 12న చేపట్టబోయే యువత పోరును జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సీఎం చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్‌కు బుద్ధి చెప్పే రోజులు దగ్గర్లోనే ఉన్నాయన్నారు. యువతను నిర్లక్ష్యం చేస్తే ఎదుర్కొనే పరిణామలు తీవ్రంగా ఉంటాయన్నారు.

మహిళల రక్షణలో ప్రభుత్వాలు విఫలం



మాట్లాడుతున్న ఏఐఎంఎస్ఎస్ రాష్ట్ర అధ్యక్షురాలు సుమలత

అనంతపురం అర్బన్: మహిళలపై జరుగుతున్న నేరాలు అరికట్టడం, రక్షణ కల్పించడంలో ప్రభుత్వాల ఘోరంగా విఫలమవుతున్నాయని ఆల్ ఇండియా మహిళ సాంస్కృతిక సంఘం (ఏఐఎంఎస్ఎస్) రాష్ట్ర అధ్యక్షురాలు సుమలత అన్నారు. ఆదివారం స్థానిక ఆజాద్ నగర్‌లోని రషీద్‌భవన్‌లో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని సంఘం నగర అధ్యక్షురాలు ఎం.గురులక్ష్మి అధ్యక్షతన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సుమలత మాట్లాడుతూ.. స్వాతంత్య్రం సిద్ధించి 76 ఏళ్లు అవుతున్నా మహిళలకు రక్షణ లేకుండా పోయిందన్నారు. రోజురోజుకూ అత్యాచారాలు, దాడులు పెరిగిపోతున్నాయన్నారు. మహిళాభివృద్ధికి కృషిచేస్తున్నామని ప్రభుత్వాలు చెబుతున్న మాటలకు చేతలకు పొంతన లేదన్నారు. మహిళలపై జరుగుతున్న నేరాలను అరికట్టడంలో ఘోరంగా విఫలమవుతున్నాయని మండిపడ్డారు. మహిళలు చేతన్యవంతులై పోరాడాలని పిలుపునిచ్చారు. మహిళలు బానిసలు కాదని.. పురుషులతో సమానమనే విషయాన్ని సమాజం గుర్తించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ రోజుల్లో విద్య, ఉద్యోగ పరంగా మహిళలు కొంత అభివృద్ధి సాధించినా భూస్వామ్య భావజాలానికి దిగజారిన పెట్టుబడిదారీ సంస్కృతికి వ్యతిరేకంగా మహిళల ఉద్యమించాలని కోరారు. కార్యక్రమంలో సంఘం నాయకురాళ్లు పద్మావతి, గౌసియా, ప్రసూన, గౌతమి, లక్ష్మీప్రసన్న, తదితరులు పాల్గొన్నారు.

సీనియార్టీ జాబితాలో తప్పులు సవరించండి



డీఈఓ ప్రసాద్‌బాబుకు వినతిపత్రం అందజేస్తున్న ఎస్టీయూ నాయకులు

అనంతపురం ఎడ్యుకేషన్: ఉపాధ్యాయుల సీనియార్టీ జాబితాలోని తప్పులను సవరించాలని రాష్ట్రోపాధ్యాయ సంఘం (ఎస్టీయూ) నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం జిల్లా విద్యాశాఖ అధికారి ప్రసాద్ బాబును కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. శ్రీసత్యసాయి జిల్లాలోని దివ్యాంగులు, అనారోగ్యంతో బాధపడుతున్న వారు ఉమ్మడి జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన కేంద్రానికి రావడానికి చాలా ఇబ్బంది పడుతున్నారన్నారు. రాష్ట్ర అధికారులతో సంప్రదించి శ్రీసత్యసాయి జిల్లా కేంద్రంలోనే అభ్యంతరాల స్వీకరణకు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. అంతర్ జిల్లా బదిలీల్లో జిల్లాకు వచ్చిన వివిధ కేడర్ల ఉపాధ్యాయులు జిల్లాలో చేరిన తేదీ వివరాలు కాకుండా వారి ఇనిషియల్ అపాయింట్‌మెంట్ తేదీ వివరాలు ఉండటంతో జాబితాలో సీనియర్ల కంటే జూనియర్లు ముందు ఉన్నారన్నారు. ప్రధానోపాధ్యాయులు చేసిన పొరపాట్లతో కొందరు ఉపాధ్యాయులు వారి స్వప్రయోజనాల కోసం ఒకే సబ్జెక్టులో డేట్ ఆఫ్ జాయినింగ్ అందరికీ ఒకే డేట్ కాకుండా వేర్వేరుగా వేశారన్నారు. అలాంటి వాటిని సరి చేస్తామని డీఈఓ సమాధానం ఇచ్చారు. ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు ఎస్. రమణా రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఎస్.రామాంజనేయులు, జిల్లా అధ్యక్షుడు జి .హరిప్రసాద్ రెడ్డి, నాయకులు జి.సూర్యుడు, కె.చంద్రశేఖర్, మల్లిఖార్జున, నారాయణ స్వామి, రామాంజనేయులు, వై.రవి పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



చలో విజవాడ పోస్టర్లు విడుదల చేస్తున్న మునిసిపల్ కార్మిక సంఘం నాయకులు

అనంతపురం అర్బన్: మునిసిపల్ కార్మికుల సమస్యల పరిష్కారానికి ఈనెల 11న చలో విజయవాడ కార్యక్రమం తలపెట్టామని మునిసిల్ కార్మిక సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేష్‌గౌడ్ తెలిపారు. ఆదివారం నగర పాలక సంస్థ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో చలో విజయవాడ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాజేష్‌గౌడ్ మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం ఏర్పాటై తొమ్మిది నెలలు అవుతున్నా మునిసిపల్ కార్మికుల సమస్య ఒక్కటి కూడా పరిష్కరించలేదన్నారు. ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని పేర్కొన్నారు. కార్మికుల నిర్వహణను ప్రైవేటు కంపెనీలకు (ఏజెన్సీలు) అప్పగించాలనే ఆలోచనను రాష్ట్ర ప్రభుత్వం విరమించుకోవాలన్నారు. వేతనాలు ఇవ్వడం, నిర్వహణ పూర్తిగా మునిసిపల్ శాఖ పరిధిలోకి తీసుకోవాలని డిమండ్ చేశారు. ఇంజినీరింగ్ విభాగం కార్మికులకు వేతనాలు పెంచాలన్నారు. సమస్యల సాధనకు ఈనెల 11న తలపెట్టిన చలో విజయవాడ కార్యక్రమానికి కార్మికులు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూ నగర ప్రధాన కార్యదర్శి కృష్ణుడు, మునిసిపల్ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు చిరంజీవి, నాయకులు వేణుగోపాల్, ప్రసాద్, నాగేంద్ర, తిరుమలయ్య, ఎర్రప్ప, శివ, తమ్మప్ప, నాగేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి అనుమానాస్పద మృతి

అనంతపురం: నగరంలోని బ్రహ్మంగారి గుడి వద్ద శనివారం రాత్రి ఓ వ్యక్తి మృతి చెందాడు. వన్‌టౌన్ పోలీసులు పలు సామాజిక మాధ్యమాల్లో సమాచారం చేరవేశారు. మృతి చెందిన వ్యక్తి జూటురు ఓబులేసు (52) తన భర్త అని నార్పల మండలం గడ్డం నాగేపల్లికి చెందిన శారద అనే మహిళ పోలీసుల దృష్టికి తీసుకెళ్లింది. జూటురు ఓబులేసు శనివారం ఆటోలో నార్పల నుంచి అనంతపురం వచ్చారు. అనారోగ్యంతో మృతి చెందారా? లేక ఏమైనా జరిగిందా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఆదివారం అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ సీఐ రాజేంద్రనాథ్ యాదవ్ పేర్కొన్నారు.

విద్యార్థి అదృశ్యం

అనంతపురం: నగరంలోని మూడో రోడ్డుకు చెందిన వి.వెంకట రాముడు కుమారుడు మణి గౌతమ్ అదృశ్యమైనట్లు మూడో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. వివరాలు.. మణి గౌతమ్ ప్రసాద్ స్కూల్‌లో 9వ తరగతి చదువుతున్నాడు. విద్యార్థికి స్కూల్ వెళ్లడం ఇష్టం లేకపోవడంతో తల్లిదండ్రులు హ్యాండ్ రైటింగ్ ట్యూషన్‌కు పంపుతున్నారు. ఈనెల 6వ తేదీ సాయంత్రం ఆరు గంటలకు ట్యూషన్ ఫీజు చెల్లించడానికి రూ.1,000 డబ్బులు ఇప్పించుకుని వెళ్లిన మణి గౌతమ్.. తిరిగి ఇంటికి రాలేదు. బంధువులు ఇళ్లు, పలుచోట్ల వెతికినా ఆచూకీ లభించలేదు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ శాంతిలాల్ తెలిపారు.

నేడు అమలకి ఏకాదశి వేడుకలు

అనంతపురం కల్చరల్: భావసార్‌క్షత్రియ సమాజ్ ఆధ్వర్యంలో నగరంలోని రామనగర్‌లో వెలసిన రుక్మిణీ పాండురంగ విఠల స్వామి ఆలయంలో సోమవారం అమలకి ఏకాదశి వేడుకలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకుడు ఆనంద్ ఓ ప్రకటనలో తెలిపారు. ఫాల్గుణ మాసంలో వచ్చే పవిత్ర ఏకాదశి పర్వదినాన్ని భవసార క్షత్రియులు అత్యంత పవిత్రంగా భావిస్తారన్నారు. ఉదయం 6:30 గంటల నుంచే వేడుకలు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. 8 గంటలకు రుక్మిణీ పాండురంగ స్వామి వార్ల నిజపాద దర్శనం, అభిషేకాలు, అర్చనలు జరుగుతాయన్నారు. భక్తులు పాల్గొని తీర్థప్రసాదాలను స్వీకరించాలని కోరారు.

సుబ్రహ్మణ్యేశ్వరా పాహిమాం



ప్రత్యేక అలంకరణలో సుబ్రహ్మణ్యేశ్వరుడు

ఆత్మకూరు: పంపనూరులోని సర్పరూప సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం విశేష పూజలు, పంచామృతాభిషకాలు నిర్వహించారు. తొలుత స్వామి మూల విరాట్‌ను పట్టువస్త్రాలు, బంగారు ఆభరణాలతో అలంకరించారు. పూజల అనంతరం స్వామి స్వర్ణముఖ కవచాన్ని ఆలయం చుట్టూ మేళతాళాలతో ప్రదక్షణలు చేయించారు. ఆలయ ప్రాంగణంలో కాలసర్పదోష నివారణ హోమాలు చేపట్టారు. ఆలయంలోని మంజునాథ స్వామి, పార్వతీ దేవికి ప్రత్యేక పూజలు నిర్వహించి మహా మంగళహారతి అందించారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేసి, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

మలహోబిలేశ్వరుడికి అభిషేకం



స్వామికి హారతి ఇస్తున్న అర్చకుడు

ఆత్మకూరు: పంపనూరు కొండపై వెలసిన మలహోబిల లక్ష్మీనరసింహ స్వామి ఉత్సవాలు కొనసాగుతున్నాయి. ఆదివారం స్వామికి విశేష పూజలు, అభిషేకాలు, ధ్వజారోహణం, కలశస్థాపన తదితర కార్యక్రమాలు నిర్వహించారు. అంతకుముందు స్వామిని ప్రత్యేకంగా అలంకరించారు.

సమాన అవకాశాల కల్పనే 'హ్యాపీ స్ట్రీట్' లక్ష్యం



మహిళలతో సంభాషిస్తున్న ఆర్డీటీ మహిళా సాధికారత డైరెక్టర్ విశా ఫెర్రర్

అనంతపురం: క్రీడల్లో అమ్మాయిలకు సమాన అవకాశాలు కల్పించేందుకు 'హ్యాపీ స్ట్రీట్' ప్రోగ్రాం నిర్వహిస్తున్నట్లు ఆర్డీటీ ప్రోగ్రాం డైరెక్టర్ మాంఛో ఫెర్రర్ అన్నారు. ఆదివారం రాత్రి ఆర్డీటీ, అనంతపురం స్పోర్ట్స్ అకాడమీ, అనంతపురం మున్సిపల్ కార్పొరేషన్ సంయుక్తంగా 'హ్యాపీ స్ట్రీట్' ప్రోగ్రాం నిర్వహించారు. కార్యక్రమానికి అసిస్టెంట్ కలెక్టర్ బి. వినూత్న, మాంఛో ఫెర్రర్ ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. మహిళల పురోగతి, క్రీడల్లో విజయాలను ప్రోత్సహించడానికి ఒక వేదికను అందించడం లక్ష్యంగా ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు పేర్కొన్నారు. అనంతరం నిర్వహించిన క్రీడా కార్యక్రమాలు, వినోదాత్మక ప్రదర్శనలు, సందేశభరిత కళాఖండాల ప్రత్యక్ష ప్రదర్శన ఆకట్టుకుంది. కార్యక్రమంలో మహిళా సాధికారత డైరెక్టర్ విశా ఫెర్రర్ పాల్గొన్నారు.

అలరించిన జగదేక సుందరి నాటకం

అనంతపురం కల్చరల్: నగరానికి చెందిన ఎల్కేపీ కళాకారులు, కర్నూలుకు చెందిన టీజీవీ కళాక్షేత్రం సంయుక్త నిర్వహణలో ఆదివారం రాత్రి స్థానిక లలిత కళాపరిషత్తులో నిర్వహించిన జగదేక సుందరి పద్య నాటకం ఆకట్టుకుంది. పల్లేటి కులశేఖర్ రచించిన జగదేక సుందరి నాటకాన్ని సీనియర్ కళాకారుడు పత్తి ఓబులయ్య దర్శకత్వంలో నటీనటులు అద్భుతంగా నటించారు. కళాకారులను ప్రోత్సహించడమే లక్ష్యంగా ఎల్కేపీ పని చేస్తోందని పలువురు తెలిపారు. అనంతరం నటీనటులను సత్కరించారు. లలిత కళాపరిషత్తు కార్యదర్శి పద్మజ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పత్తి ఓబులయ్య, సీనియర్ నటులు సంగాల నారాయణ స్వామి, రాంగోవింద సాగర్ తదితరులు పాల్గొన్నారు.